క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జక్రాన్‌పల్లి: మండలానికి చెందిన ముగ్గురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన శరణ్యకు రూ.15 వేలు, నర్సయ్యకు రూ.24 వేలు, సాయన్న రూ.8వేలు చొప్పున చెక్కులు మంజూరైనట్లు తెలిపారు.

విద్యుత్ మరమ్మతులు

నిజామాబాద్‌నాగారం: నగరలోని ఆర్ఆర్ చౌరస్తా నుంచి న్యాల్‌కల్ రోడ్‌లోని పీఎఫ్ ఆఫీస్ వరకు విద్యుత్ మరమ్మతులు చేస్తున్నారు. మున్సిపల్ నుంచి రూ.8 లక్షలు కట్టడంతో విద్యుత్ డీఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. రోడ్డు వెడల్పులో భాగంగా నూతనంగా 10 స్తంభాలతో పాటు రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు షిఫ్ట్ చేస్తున్నారు. అలాగే వైర్ల మీద ఉన్న చెట్ల కొమ్మలను సైతం తొలగించారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



డిచ్‌పల్లి: అమృతాపూర్‌లో రూ.5 లక్షల వ్యయంతో గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్‌ను బుధవారం నిజామాబాద్ నగర పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు కూరపాటి గంగాధర్, సర్పంచ్ కులాచారి లత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత మంజూరు చేసిన రూ.5 లక్షలతో ఈ కమ్యూనిటీ హాల్ నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఒడ్డె సాయిలు, నాయకులు గంగాధర్‌గౌడ్, వడ్ల నర్సయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం



సిరికొండ:మండలంలోని హుస్సేన్‌నగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ దానెం లక్ష్మి బుధవారం ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవర్ధన్, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు రాజేందర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌లో నియామకాలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా కామారెడ్డి మల్లేష్, జిల్లా ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస్, ఎంఈఎఫ్ రాష్ట్ర కన్వీనర్‌గా సలంద్ర బాబురావు, జిల్లా అధ్యక్షుడిగా గుండారం మోహన్‌లను నియమించారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు, మాదిగల హక్కుల కోసం ముందుంటానని తెలిపారు. అమరవీరుల సంస్మరణ సభను జరిపి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యెండల జన్మదిన వేడుకలు



నిజామాబాద్ సిటీ: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు గాడ్స్ స్కూల్‌లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం నగర శివారు హైదరాబాద్ రోడ్డు బ్యాంక్ కాలనీలో గల గాడ్స్ స్కూల్‌లో నాయకులు పిల్లలతో కేక్ చేయించి వారికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిజామాబాద్ జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. భారతి శ్రీను, రవికుమార్, మహేష్, నరేష్, అంకుష్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా ట్యాంక్ బండ్ పనులు

- కాలూరు చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క
- గతంలో శుభ్రం చేయడానికి వినియోగించిన నుడా నిధులు వృథా



కాలూర్ చెరువును ఆక్రమించిన గుర్రపుడెక్క

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కాలూర్ మినీ ట్యాంక్ బండ్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ట్యాంక్ బండ్ అభివృద్ధికి రూ.లక్షల నిధులు వెచ్చించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. ఈ చెరువులో చుక్క నీరు కనిపించనంతగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. నిజామాబాద్ నగరానికి సమీపం(దుబ్బ ప్రాంతం వైపు)లోని కాలూర్ చెరువును ఆధునీకరించి కాలూర్, ఖానాపూర్, నిజామాబాద్ నగర ప్రజలు సేదతీరేలా చెరువు పరిసరాలను ఆహ్లాదకరంగా, అందంగా తీర్చిదిద్దటానికి ప్రణాళికలు రూపొందించారు. నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)నుంచి రూ.70 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించటంతో పాటు చెరువు కట్టను వెడల్పు చేసి కట్టపై అందమైన మొక్కలు, గ్రీనరీ ఏర్పాటు చేసే పనులను గత ఏడాది చేపట్టారు. గుర్రపుడెక్కను తొలగించేందుకు చెరువులోని నీటిని మొత్తం ఖాళీ చేసి పనులు మొదలుపెట్టారు. చెరువులో మరోమారు గుర్రపుడెక్క పెరగకుండా వేర్లతో సహా తొలగించేందుకు చెరువులో కొంతలోతు వరకు త్రవ్వి ఆ మట్టిని ఇతర చోటుకు తరలించారు.పనులు జరుగుతుండగా మధ్యలో ఆటంకాలు ఎదురయ్యాయి.కాలూర్ ఎగువ గల ఖానాపూర్,గుండారం ప్రాంతాల వైపు నుంచి నిజాంసాగర్ సబ్ కెనాల్ ద్వారా పొలాలకు వదిలిన నీళ్లు కాలూర్ చెరువులోకి వచ్చి చేరాయి.ఆ నీటిని ఆపటం సాధ్యం కాకపోవటంతో చెరువులో గుర్రపు డెక్క తొలగించే పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. చెరువులో భారీగా నీరు నిండటంతో మళ్లీ గుర్రపు డెక్క భారీగా పెరిగింది. దాంతో గుర్రపుడెక్కను తొలగించేందుకు కేటాయించిన నిధులు వృథా అయ్యాయి. ఇప్పుడు మళ్లీ గుర్రపుడెక్కను తొలగించాలంటే మరిన్ని నిధులు అవసరమవుతున్నాయి.

నీటి చేరికతో పనులు నిలిచిపోయాయి

కాలూర్ చెరువులో పూడిక పనులు జరుగుతుండగా చెరువు పైభాగం నుంచి లోనికి నీళ్లు వచ్చి చేరాయి. దాంతో పూడిక పనులు, గుర్రపు డెక్కను తొలగించే పనులకు ఆటంకం ఎదురైంది. దాంతోపాటు చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దటానికి కేటాయించిన నిధులు సరిపోకపోవటంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మరిన్ని నిధులు కేటాయిస్తే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

–ముస్కే సంతోష్, నుడా డైరెక్టర్

సైన్స్‌లో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



తెయూలో ప్రసంగిస్తున్న విజయ్‌పాల్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

- అరబిందో ఫార్మా అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి
- తెయూలో జాతీయ సైన్స్ దినోత్సవం

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు సైన్స్‌లో జ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేత్త సీవీ రామన్ లాగా ఎదగాలని అరబిందో ఫార్మా అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌పాల్ రెడ్డి సూచించారు. తెలంగాణ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గద్ద తన పిల్లలను రెక్కలు రాగానే గూటిపై నుంచి కింద పడేస్తుందని, పిల్ల గద్దలు ఎగరడం నేర్చుకునే వరకు గూటి నుంచి తోసి వేస్తూనే ఉంటుందన్నారు. విద్యార్థులు గ్రద్దను చూసి దూరదృష్టిని నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలలో ధైర్య సాహసాలను నూరిపోయాలని, కంఫర్ట్ జోన్ నుంచి ఛాలెంజింగ్ జోన్‌కు తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం విద్యార్థులు జీవితంలో సవాళ్లు ఎదురు కాగానే పిరికిగా మారి ఆత్మహత్య చేసుకుంటున్నారని, దీనివల్ల తల్లిదండ్రులకు బాధ తప్ప ఏమీ ఇవ్వలేరని తెలుసుకోవాలన్నారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలంటే మనలోని సోమరితనం విడనాడాలని సూచించారు. త్వరలోనే అరబిందో ఫార్మా తరపున తెయూలో ప్లేస్‌మెంట్ నిర్వహిస్తామని తెలిపారు. గౌరవ అతిథిగా హాజరైన తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సీహెచ్ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని, శాస్త్ర సాంకేతిక రంగాలలో పేరు సంపాదించాలని సూచించారు. తెయూ వీసీ రవీందర్ మాట్లాడుతూ.. తన పీహెచ్‌డీ గురువు, సీవీ రామన్‌కు శిష్యుడని తెలిపారు. తెయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, ప్రొఫెసర్ ఎం.అరుణ, ప్రిన్సిపాల్ సీహెచ్‌ఆరతి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

ఖలీల్‌వాడి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఒక రోజు సమ్మెలో భాగంగా బుధవారం నిజామాబాద్‌అర్బన్, డిచ్‌పల్లి ప్రాజెక్టులకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో నిజామాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ మేరకు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి స్వర్ణ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వాలు వాటిని పట్టించుకోవటం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లను టీచర్లుగా పేరు మార్చి వేతనాలు మాత్రం అరకొరగా ఇస్తున్నారని వాపోయారు. నెలకు కనీసం రూ.26 వేల వేతనం ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లాలో విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిజామాబాద్ జిల్లా జేఏసీ చైర్మన్ రఘునందన్ మాట్లాడుతూ.. యజమాన్యం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ రేజర్ల బాలరాజ్ కుమార్, కో– చైర్మన్ గంగాధర్, కో కన్వీనర్ తోట రాజశేఖర్, ఆర్. రవీందర్, జేఏసీ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం



నగరంలో దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఖలీల్‌వాడి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపై దాడికి నిరసనగా నగరంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు కిరాయి గుండాలతో రేవంత్ రెడ్డిపై దాడులు చేయిస్తున్నారని, రేవంత్ రెడ్డి జోలికి గాని కాంగ్రెస్ జోలికి గాని వస్తే సహించేది లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతాయని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతిదాడి చేయలేదని ఒకవేళ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉంటుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల మౌనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దని ఆయన హెచ్చరించారు. మళ్లీ దాడులకు పాల్పడితే బీఆర్ఎస్ నాయకులు ఇంటి నుంచి కాలు బయటపెట్టే పరిస్థితి లేకుండా చేస్తామని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్, 38వ డివిజన్ కార్పొరేటర్ గడుగు రోహిత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అబుద్ బిన్ హందాన్, తదితరులు ఉన్నారు.

దోమల బెడద నివారించాలని వినతి



ఖలీల్‌వాడి: నిజామాబాద్ మున్సిపల్ నగరపాలక సంస్థ పరిధిలో దోమల బెడద నివారించాలని బుధవారం నగర పాలక సంస్థ మేనేజర్ జనార్దన్‌కు సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ వినతిపత్రం అందజేశారు. సుధాకర్ మాట్లాడుతూ.. దోమల బెడదతో నగరంలో నివసించే వారికి మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగీ లాంటి వ్యాధులకు గురవుతున్నారని, వెంటనే మున్సిపల్ అధికారులు చొరవ చూపి నగరంలోని వీధులలో ఫాగింగ్ చేయాలని కోరారు. సీపీఐ దక్షిణ మండల కార్యదర్శి రంజిత్ కుమార్, ఉత్తర మండల కార్యదర్శి ముత్యాలు పాల్గొన్నారు.

ప్రీతి కుటుంబానికి అండగా ఉంటాం



ఇందల్వాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

ధర్పల్లి(ఇందల్వాయి): మెడికో ప్రీతి కుటుంబానికి న్యాయం వెంటనే జరగాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఇందల్వాయి మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నాను నిర్వహించారు. విద్యార్థిని మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. వరంగల్ ఎంజీఎం కాకతీయ మెడికల్ కాలేజ్ డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీపీ రమేష్ నాయక్, గిరిజన సంఘాల నేతలు రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న బంజారా నేతలు

సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి

ధర్పల్లి: ప్రీతి నాయక్‌ను మానసికంగా హింసించి చావుకు కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించి, ఉరితీయాలని కోరుతూ ధర్పల్లి మండల బంజారా నాయకులు సీఐ సైదాకు వినతి పత్రాన్ని బుధవారం సమర్పించారు. వెంటనే సైఫ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు బంజారా సంఘాలు అండగా ఉంటాయని వారు పేర్కొన్నారు. సంఘం మండల అధ్యక్షుడు లాల్ సింగ్, నాయకులు శంకర్, శ్రావణ్ కుమార్ ఉన్నారు.

సీఎం పర్యటన.. ముందస్తు అరెస్టులు

సాక్షి నెట్‌వర్క్ :సీఎం కేసీఆర్ కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చేస్తున్న సందర్భంగా అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో ప్రతి పక్ష పార్టీల నాయకులతో పాటు మంచిప్ప ముంపు నిర్వాసితుల కమిటీ ప్రతినిధులను బుధవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించి సీఎం పర్యటన ముగిసిన తర్వాత వారిని విడుదల చేశారు.



మోపాల్ పోలీస్‌స్టేషన్‌లో మంచిప్ప రిజర్వాయర్ ముంపు నిర్వాసితులు



సిరికొండ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు



మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కార్పొరేటర్ గడుగు రోహిత్, యూత్ కాంగ్రెస్ నేతలు

సమాచారం..

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

నిజామాబాద్ సిటీ: నగరంలోని గంగాస్థాన్ ఉత్తర తిరుపతి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో నేడు(గురువారం) శ్రీనివాస కల్యాణం, రథోత్సవాల కార్యక్రమాలు జరగనున్నాయి. సాయంత్రం 6 గంటలకు శ్రీనివాస్ కళ్యాణం, 8 గంటలకు రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ తెలిపింది.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



స్వామి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నేతలు

డిచ్‌పల్లి: ఘన్‌పూర్ గ్రామానికి చెందిన రైతు బొల్లారం స్వామి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. గత సోమవారం అప్పుల బాధతో రైతు స్వామి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం స్వామి కుటుంబాన్ని వెంకటేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం బాగా లేక రూ.14లక్షల అప్పుల పాలైన స్వామి ఎకరం భూమి అమ్మినా అప్పులు తీరకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతునికి రైతు బంధు సైతం రావడం లేదన్నారు. మృతుని భార్య, ముగ్గురు పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు బీమా అందజేయాలని కోరారు.

అధికార పార్టీ నేతలూ ‘జిల్లా’పై స్పందించండి



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు కావాలని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను అధికార పక్ష నేతలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని న్యాయవాదులు అన్నారు. తాము రిలే నిరాహార దీక్షలు చేపట్టి రెండున్నర నెలలు పూర్తికావస్తున్నా అధికార పక్ష ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 73వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాదులు కులకర్ణి దత్తాత్రిరావు, రమేష్‌లు కూర్చున్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రవి(48) గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం ఉదయం రమేశ్‌కు ఛాతిలో నొప్పి రావడంతో అతని కొడుకు ఓ ప్రైవేటు ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి రవి గుండెపోటుతో మరణించినట్లు ధ్రువీకరించారు. రవి కుటుంబ సభ్యులను సీఐ వెంకటనారాయణ, ఎస్సై సందీప్ పరామర్శించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	56,850	వెండి (కిలో)	67,950
22 క్యారెట్స్	52,750		

- నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	20	క్యాప్సికం	20	40
బెండకాయ	50	70	గాజరుగడ్డ	20	30
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	25	40
దొండకాయ	25	40	దోసకాయ	10	20
బీర్నీసుకాయ	35	50	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	8	20	గోబిపువ్వు	15	30
పాలకూర	10	20	బీట్‌రూట్	15	30
మెంతికూర	20	40	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	10	20	చిక్కుడుకాయ	30	50
పుదీనా	30	50			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్–1– సార్– 1.45,7.45
వినరో భాగ్యము విష్ణుకథ –4.45
స్క్రీన్–2– వినరో భాగ్యము విష్ణుకథ–1.55, 7.55,10.45
స్క్రీన్–3– కోనసీమ –1.55,7.55
యాంట్–మెన్ అండ్ ది వాస్ప్(ఇంగ్లీష్) –10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్–1– సెల్ఫీ–(హిందీ)–10.40,4.40,10.40
యాంట్–మెన్ అండ్ ది వాస్ప్(ఇంగ్లీష్) –1.50, 7.50,10.30
స్క్రీన్–2 – సెల్ఫీ –(హిందీ)–12.00
సార్ – 3.15, 10.00
పఠాన్–(హిందీ)–6.30
స్క్రీన్–3– సెల్ఫీ–(హిందీ)–1.10,7.20
కోనసీమ–4.20,10.30
స్క్రీన్–4– వినరో భాగ్యము విష్ణు కథ –12.40, 4.00, 7.00
పఠాన్ –హిందీ–10.20

దేవి సార్
నటరాజ్ యాంట్–మెన్ అండ్ ది వాస్ప్
లలితామహల్ వాల్తేరు వీరయ్య
శ్రీదేవి మిస్టర్ కింగ్స్
విజయ్ వినరో భాగ్యము విష్ణు కథ

అనాథ చిన్నారులను ఆదుకోవాలి



నవీపేట: తల్లిదండ్రుల ఆత్మహత్యలతో అనాథలుగా మారిన పోతంగల్ గ్రామానికి చెందిన చిన్నారులు నాగలక్ష్మి, సహస్ర, విష్ణుప్రియలను ఆదుకోవాలని గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు గంధం రాజేష్ కోరారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి ఆయన మాట్లాడారు. నవీన్ అప్పుల బాధతో మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. నవీన్ భార్య లలిత మూడేళ్ల కిందట అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. చిన్నారులను ఎమ్మెల్సీ కవిత ఆదుకోవాలని కోరారు.